సాక్షి నంద్యాల

సోమవారం ׀ 3 ׀ జూలై ׀ 2023



అమ్మవారికి ఊయల సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబాదేవికి ఆదివారం శాస్త్రోక్తంగా ఊయలసేవ నిర్వహించారు. ఊయలలో స్వామిఅమ్మవార్ల మూర్తులను ఉంచి షోడశోపచారపూజలు చేపట్టారు.



పట్టువస్త్రాల సమర్పణ

మంత్రాలయం: గురుపౌర్ణమిని పురస్కరించుకుని టీటీడీ అధికారులు ఆదివారం శ్రీ రాఘవేంద్రస్వామికి పట్టువస్త్రాలను సమర్పించారు. మూలబృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు.



సబ్సిడీ టమాటా పంపిణీ

టమాటా ధరలు పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం సబ్సిడీపై కిలో రూ.50 ప్రకారం పంపిణీ చేస్తోంది. ఆదివారం కర్నూలులో 5,500 మందికి కిలో చొప్పున అందజేశారు.

8లో▸

న్యూస్‌రీల్

నేడు 'జగనన్నకు చెబుదాం - స్పందన'

నంద్యాల: ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు సోమవారం నంద్యాల పట్టణం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో వినూత్న తరహాలో 'జగనన్నకు చెబుదాం - స్పందన' కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ డా.మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ హాజరై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించాలన్నారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా 'జగనన్నకు చెబుదాం - స్పందన' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మహానందిలో భక్తుల సందడి



కోనేరులో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

మహానంది: మహానంది ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. సెలవురోజు కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులు ముందుగా స్థానిక కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. ఉదయం నుంచి ప్రారంభమైన స్వామి, అమ్మవారి దర్శనం రాత్రి వరకు కొనసాగింది. ఆర్జిత సేవాటికెట్లు, అభిషేకం, ప్రసాదాల విక్రయం, వసతి విభాగాల ద్వారా ఆలయానికి ఒకేరోజు సుమారు రూ. 3.50 లక్షలకు పైగా ఆదాయం సమకూరింది.

టైలర్ కుమారుడికి ఈసెట్‌లో స్టేట్ ఫస్ట్‌ర్యాంక్



కుమారుడు గోరంట్ల ప్రవీణ్ కుమార్ స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

ఆదోని సెంట్రల్: పట్టణానికి చెందిన జి. నారాయణ, దేవకదేవి కుమారుడు గోరంట్ల ప్రవీణ్ కుమార్ ఈసెట్‌లో రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించాడు. అల్ ఇండియా ఇంటి గ్రేటెడ్ ర్యాంకులలో 29వ ర్యాంకును సాధించాడు. తండ్రి వృత్తి రీత్యా టైలర్. తల్లి గృహిణి. అయినప్పటికీ కుమారుడు చదువు మీద ఉన్న శ్రద్ధను గమనించి వారు ప్రోత్సహిస్తూ వచ్చారు. జి. ప్రవీణ్ కుమార్ పదో తరగతిలో 9.3 గ్రేడ్‌లో ఉత్తీర్ణత సాధించాడు. పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ పరీక్షల్లో 301 ర్యాంకును సాధించి తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో ఈసీఈ కోర్సులో చేరి ఈ ఏడాదే పూర్తి చేశాడు. ఈ సెట్ పరీక్ష రాయగా అందులో రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించినట్లు తెలిపాడు. కుమారుడు రాష్ట్రంలో మొదటి ర్యాకు సాధించడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.

అనాథ శవాన్ని ఇంటికి చేర్చిన ఆధార్‌కార్డు

డోన్ టౌన్: ఆధార్ కార్డు.. ఓ అనాథ శవాన్ని అయినోళ్ల దగ్గరికి చేర్చి కుటుంబీకుల చేతుల మీదుగా దహన సంస్కారాలు అయ్యేందుకు దారి చూపింది. కుటుంబ సమస్యలతో పదేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయి ఒంటరిగా జీవించిన ఓ వ్యక్తి చివరకు అనాథగా మృతి చెందాడు. అనాథ శవానికి అంత్యక్రియలు పూర్తి చేసేందుకు స్థానికులు సిద్ధమయ్యారు. ఇంతలో ప్యాంట్ జేబులో చిరిగి పోయిన ఆధార్ కార్డును గుర్తించి కుటుంబీకుల చెంతకు చేర్చారు. ఈ సంఘటన డోన్ పట్టణంలో చోటు చేసుకుంది. స్థానిక రైల్వే స్టేషన్‌లో శనివారం సాయంత్రం ఓ వ్యక్తి మూర్ఛ వ్యాధితో అస్వస్థతకు గురి కాగా ద్రోణాచలం సేవా సమితి సభ్యుడు డ్రైవర్ రహంతుల్లా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. కాగా చికిత్స పొందుతూ ఆ వ్యక్తి కోలుకోలేక ఆదివారం ఉదయం మృతి చెందాడు. సమాచారం అందుకున్న ద్రోణాచలం సేవా సమితి సభ్యులు షాదీఖానా రాజు, గురుస్వామి, పానీపూరి మురళి, కరుణాకర్, రఫీ, కరిముల్లా, హోమేశ్వరరెడ్డి, మస్తాన్ అక్కడికి చేరుకున్నారు. హిందూ సంప్రదాయం మేరకు అంత్యక్రియలు నిర్వహించేందుకు సిద్ధమై మృతదేహానికి స్నానం చేయిస్తుండగా ప్యాంట్ జేబులో చిరిగిన ఆధార్ కార్డు కనిపించింది. మృతుడిది వెల్దుర్తి మండలం బొమ్మిరెడ్డిపల్లెకు చెందిన నాయకంటి ఆగస్టీగా గుర్తించారు. ఆగస్టి భార్య కొన్నాళ్ల క్రితం చనిపోగా.. అతని కుమారుడు ఉపాధి నిమిత్తం బేతంచెర్ల మండలం ఆర్‌ఎస్ రంగాపురంలో ఉండటంతో బంధువుల ద్వారా విషయం తెలుసుకుని డోన్‌కు చేరుకున్నాడు. పదేళ్ల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన తమ తండ్రి చివరి చూపు దక్కేలా చేసిన ద్రోణాచలం సేవా సమితి సభ్యులకు మృతుడు కుమారుడు కృతజ్ఞతలు తెలిపారు.

చాగలమర్రి వద్ద చేపట్టిన 36 బ్లాక్ పనులు



మూడు మండలాలు.. 50వేల ఎకరాలు.. ఏళ్లనాటి సమస్య. పరిష్కరించేందుకు 2005లో వైఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే, నిర్మాణ సంస్థ మధ్యలోనే చేతులెత్తేసింది. 13 ఏళ్ల గడిచినా.. ఆ తర్వాత ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదు. తాజాగా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే చొరవతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడ్డంకులు తొలగించి నిధులు మంజూరు చేశారు. దీంతో తెలుగుగంగ డిస్ట్రిబ్యూటరీ పనులు మొదలయ్యాయి. ఈ పనులు పూర్తయితే ఆళ్లగడ్డలో 50వేల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. ఇదే సమయంలో తెలుగుగంగ ప్రధాన కాలువ లైనింగ్ కూడా ఈ నెలాఖరుకు పూర్తి కానుండటం విశేషం. ఫలితంగా నంద్యాల జిల్లాలో 1.14లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. – సాక్షి ప్రతినిధి, కర్నూలు



చాగలమర్రి సమీపంలో తెలుగుగంగ ప్రధాన కాల్వ లైనింగ్ పనులు జరుగుతున్న దృశ్యం

పంట నవ్వేలా.. గొంతు తడిసేలా!

- తెలుగు గంగ డిస్ట్రిబ్యూటరీ పనులకు మోక్షం
- వైఎస్ హయాంలో ఆళ్లగడ్డ పరిధిలో 18 డిస్ట్రిబ్యూటరీ పనులకు టెండర్లు
- 75శాతం పనులు చేసి మధ్యలో నిలిపేసిన నిర్మాణసంస్థ
- సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి
- నిధుల మంజూరుతో తిరిగి మొదలైన పనులు
- ఈ నెలాఖరుకు రూ.286కోట్లతో చేపట్టిన తెలుగుగంగ ప్రధాన కాలువ లైనింగ్ కూడా పూర్తి

తెలుగుగంగ ప్రధాన కాలువ చెన్నై తాగునీటి అవసరాలు తీర్చేందుకు నిర్మించబడింది. ఈ నీటిని సాగునీటి అవసరాలకూ వినియోగించుకునేందుకు వైఎస్ ప్రభుత్వం సంకల్పించింది. డిస్ట్రిబ్యూటరీలు (ఉప, పిల్లకాలువలు) ఏర్పాటు చేసి ప్రతీ ఎకరాకు సాగునీరు అందించే ప్రయత్నం చేసింది. ఇందులో భాగంగా ఆళ్లగడ్డ పరిధిలో 20వ బ్లాక్ నుంచి 37వ బ్లాక్ వరకు 18 బ్లాక్‌ల టెండర్లను 2005లో పిలిచారు. జీవీపీఆర్ అనే సంస్థ ఈ పనులను దక్కించుకుంది. 75 శాతం పనులను చేసి 2011లో ఆపేసింది. ఆ తర్వాత పనుల్లో పురోగతి లోపించింది. అయితే పనులను క్లోజ్ చేసి జీవీపీఆర్‌ను తప్పించే ప్రయత్నం నీటి పారుదలశాఖ చేయలేకపోయింది. పనులు చేయలేమని ఏజెన్సీ కూడా చెప్పకుండానే చేతులెత్తేసింది. దీంతో 13 ఏళ్లుగా కళ్లెదుట నీళ్లు పారుతున్న పొలాలకు పారించుకోలేని పరిస్థితి రైతులది.

ఫ్యాక్షన్ గడ్డలో జలసిరులు

పనులకు ముఖ్యమంత్రి గ్రీన్‌సిగ్నల్

ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి సమస్యను అసెంబ్లీలో ప్రస్తావించారు. ఆపై ముఖ్యమంత్రికి ప్రత్యేకంగా విన్నవించారు. వెంటనే సీఎం స్పందించి పాత పనులను క్లోజ్ చేసి, కొత్త ప్రతిపాదనలు చేయించి నిధులు మంజూరు చేశారు. దీంతో 18 బ్లాక్‌ల్లో నిలిచిపోయిన పనులకు మరో రూ.20 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఏప్రిల్‌లో టెండర్లు, మేలో అగ్రిమెంట్ ప్రక్రియ పూర్తయింది. ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయి. 110 పనులను 8 ఏజెన్సీలు దక్కించుకున్నాయి. కాంక్రీట్, ఎర్త్‌వర్క్, గ్రావెల్ పనులు చేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే రుద్రవరం, ఆళ్లగడ్డ, చాగలమర్రి మండలాల్లో 50 వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. నియోజకవర్గంలో పండ్లతోటల సాగు అధికం. సాగునీరు అందిస్తే రైతులు బంగారు పంటలు పండించుకుంటారు. దీంతో నియోజకవర్గం సస్యశ్యామలం కానుంది.

తెలుగుగంగ ప్రధాన కాలువ పూర్తి

జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలుగు



పెద్ద వంగలి వద్ద 37వ బ్లాక్ పనులు జరుగుతున్న దృశ్యం

గంగ ప్రధాన కాలువ లైనింగ్ పనులకు శ్రీకారం చుట్టింది. రాఘవ కన్‌స్ట్రక్షన్ రూ.286 కోట్లతో పనులు చేస్తోంది. బానకచర్ల నుంచి వెలుగోడు వరకు 11 కి.మీ మేర లైనింగ్ పూర్తికానుంది. మరో వైపు వెలుగోడు నుంచి గాజులపల్లె సమీపంలోని కృష్ణనంది వరకు 42.6 కిలోమీటర్లు లైనింగ్ పనులు పూర్తయ్యాయి. దీంతో మొత్తం 53.6 కిలోమీటర్ల మేర ప్రధాన కాలువ లైనింగ్ పూర్తికావడంతో నీటి ప్రవాహం పెరగనుంది. 5వేల క్యూసెక్కుల సామర్థ్యంతో కాలువ నిర్మించినా లైనింగ్ లేకపోవడంతో 3వేల క్యూసెక్కులు మాత్రమే వెళ్లేవి. లైనింగ్ పూర్తయితే పూర్తిస్థాయిలో 5వేల క్యూసెక్కులు ప్రవహిస్తాయి. ప్రస్తుతం వరదనీటి లభ్యత కూడా తగ్గింది. గతంలో 120 రోజుల నీటి లభ్యత ఉంటే ఇప్పుడు 75–80 రోజులకు తగ్గింది. ఉన్న తక్కువ రోజుల్లో ఎక్కువ నీరు ప్రవహించడంతో రిజర్వాయర్‌లు నింపుకునే అవకాశం ఉంటుంది. ఆళ్లగడ్డ, శ్రీశైలం పరిధిలో 1.14 లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు దిగువన వైఎస్సార్ జిల్లాలో బ్రహ్మంసాగర్‌కు తక్కువ రోజుల్లోనే ఎక్కువ నీటిని పంపే అవకాశం ఏర్పడనుంది. మొత్తం అటవీప్రాంతంలో కాలువ ఉండటంతో నీటి వృథా కూడా తక్కువగా ఉంటుంది.

శాశ్వత పరిష్కారం

లైనింగ్, డిస్ట్రిబ్యూటరీ పనులు పూర్తయితే ఆళ్లగడ్డ మునిసిపాలిటీకి శాశ్వతంగా తాగునీటి సమస్య తీరనుంది. తుండ్లవాగు రిజర్వాయర్ సామర్థ్యం 0.7 టీఎంసీలు. తెలుగుగంగ నీటిని రిజర్వాయర్‌లో నింపితే వేసవిలో కూడా తాగునీటి సమస్య ఉండదు.

ఆళ్లగడ్డ సస్యశ్యామలం



డిస్ట్రిబ్యూటరీ పనులు 13 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. ఈ పనులను క్లోజ్ చేయకపోవడంతో రద్దు కాలేదు. దీంతో పనులు చేసేందుకు ఆటంకం ఏర్పడింది. విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించారు. వీలైనంత త్వరలో పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు ఇస్తాం. ఈ ప్రాంతం సస్యశ్యామలవుతోంది. ఆళ్లగడ్డకు తాగునీటి సమస్య తీరుతుంది. పనులకు సహకరించిన ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు.

– గంగుల బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్యే, ఆళ్లగడ్డ

డిస్ట్రిబ్యూటరీ పనులు ప్రారంభం

2005లో మొదలైన పనులు అప్పటి ఏజెన్సీ మధ్యలో నిలిపేసింది. దీంతో పదేళ్లకుపైగా పనులు జరగలేదు. తిరిగి రూ.20కోట్లతో టెండర్లు పిలిచాం. ఏజెన్సీలు పనులు ప్రారంభించాయి. త్వరలోనే పనులు పూర్తి చేస్తాం. నియోజకవర్గంలో 50వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది.

– శంకర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, తెలుగుగంగ

సంక్షేమానికి 'సురక్ష'

గతంలో ఇలా: ప్రభుత్వం అందించే పథకాలకు లబ్ధి పొందాలంటే నెలల తరబడి చూడాల్సిన దుస్థితి. ఏదైనా ధ్రువీకరణ పత్రాలు పొందాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి. మధ్య దళారులకు అంతో ఇవ్వాల్సిందే. లేదంటే నేతల సిఫారసులు ఉండాల్సిందే.

ప్రస్తుతం ఇలా: సామాన్యుని ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు దరి చేరాయి. పేదల బాగోగులతో పాటు అన్ని రకాల పథకాలను అడిగి మరీ అందించే బాధ్యత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్నారు. అర్హులై ఉండి సంక్షేమ పథకాలకు ఎందుకు దూరమయ్యారో తెలుసుకుని అసరమైన ధ్రువీకరణ పత్రాలు ఇంటి వద్దకు చేర్చే 'జగనన్న సురక్ష' కార్యక్రమం చేపట్టారు. ఎలాంటి రుసం లేకుండా ఉచితంగా 11రకాల ధ్రువీకరణ పత్రాలను అర్హులకు అందజేస్తున్నారు. ధ్రువీకరణ పత్రాలు అందుకున్న లబ్ధిదారులు జగనన్న సుపరి పాలనను కొనియాడుతున్నారు.

కౌలు కార్డు ఇంటికి వచ్చె..



ఈ చిత్రంలో కౌలు కార్డు చూపిస్తున్న రైతు పేరు సూర్యనారాయణ రెడ్డి. నంద్యాల జిల్లా దొర్నిపాడు మండలం గుండుపాపల గ్రామవాసి. సొంత పొలం లేకపోవడంతో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేస్తున్నాడు. వలంటీర్ ఇంటి వద్దకే వచ్చి ఈయన సమస్య తెలుసుకున్నారు. కౌలు కార్డు కోసం దరఖాస్తు చేయించి సచివాలయంలో అందజేశారు. కౌలుకార్డును ఇంటి వద్దనే అందజేయడంతో రైతు సూర్యనారాయణ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. వైఎస్సార్ రైతు భరోసా, పంటనష్ట పరిహారం, పంటల బీమా వంటి పథకాలకు ఈ కార్డు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు.

క్షణాల్లో అనుసంధానం




చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు వెంకట లక్ష్మమ్మ. గోస్పాడు మండలం జూలేపల్లె గ్రామం. ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ అనుసంధానం కాకపోవడంతో బ్యాంక్ అకౌంట్ నిర్వహణ, సంక్షేమ పథకాల దరఖాస్తు సమయాల్లో ఓటీపీ నంబర్ రాక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంది. అధికారులు పలుమార్లు సూచించినా ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానం చేసుకునేందుకు అవగాహన లేకపోవడంతో అలాగే ఉండి పోయింది. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అధికారులు గ్రామానికి రాగా సమస్యను చెప్పడంతో క్షణాల్లో ఆధార్‌కు ఫోన్ నంబర్ అనుసంధానం చేసేశారు.

లోక క్షేమంకరీ.. శాకాంబరీ

- నేడు ఆషాఢ పౌర్ణమి సందర్భంగా భ్రామరీకి శాకాంబరీ ఉత్సవం
- పలు రకాల కూరగాయలతో అమ్మవారికి అలంకరణ



కూరగాయలను మాలగా కుడుతున్న మహిళలు



అమ్మవారి ఆలయం

శ్రీశైలంటెంపుల్: ఆదిపరాశక్తి ఎన్నో నామాలను పొందింది. ఎన్నో రూపాలను ధరించింది. మరెన్నో వరాలను కురిపించింది. అన్ని లీలల్లో ఉండే అంతరార్థం ఒకటే. అదే ఆమెలో అమ్మతనం. తన అమ్మతనంలో ఆ పరాశక్తి ధరించిన అవతారాలలో శాకంబరీ స్వరూపం ఒకటి. అమ్మవారి లీలా రూపాలలో శాకాంబరీ స్వరూపం ప్రసిద్ధం. మాతృత్వానికి ప్రతీకగా చెప్పదగిన ఈ రూపవిశేషాన్ని దేవీభాగవతంలో గొప్పగా వర్ణించారు. సోమవారం ఆషాఢ పౌర్ణమి సందర్భంగా భ్రామరీకి శాకాంబరీ ఉత్సవం నిర్వహించేందుకు శ్రీశైల దేవస్థానం ఏర్పాట్లు చేసింది. శ్రీశైల మహాక్షేత్రంలో జరిగే వార్షిక ఉత్సవాలలో శాకాంబరీ ఉత్సవం ఒకటి. ఏటా ఆషాఢ పౌర్ణమి రోజున ఎంతో వైభవంగా ఈ ఉత్సవం నిర్వహిస్తారు. అందులో భాగంగా సోమవారం అమ్మవారి మూలమూర్తిని పలు రకాల ఆకుకూరలు, కూరగాయలు, ఫలాలతో అలంకరిచి పూజలు నిర్వహిస్తారు. అలాగే ఆలయ ప్రాంగణంలోని రాజరాజేశ్వరీ అమ్మవారిని, సప్త మాతృకలను, గ్రామదేవత అంకాలమ్మను కూడా వివిధకూరగాయలతో అలంకరించి పూజలు నిర్వహిస్తారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

2,500 కేజీల కూరగాయలు, ఫలాలతో..

భ్రమరాంబాదేవికి నిర్వహించనున్న శాకాంబరీ ఉత్సవానికి దేవస్థానం 2,500 కేజీల వివిధ రకాల ఫలాలు, కూరగాయలు, ఆకుకూరలు వినియోగించనున్నారు. వంగ, బెండ, దొండ, కాకర, చిక్కుడు, గోరుచిక్కుడు, మునగ, గుమ్మడి, బీర, బంగాళదుంప, కంద దుంప, క్యాప్సికమ్, క్యాబేజీ, బీన్స్, క్యారెట్, అరటి, మొదలైన వివిధకూరగాయలు, తోటకూర, పాలకూర, మెంతి కూడ, చుక్క కూర, మొదలైన పలు రకాల ఆకుకూరలు, కమల, బత్తాయి, ద్రాక్ష, యాపిల్, అరటి, పైనాపిల్, పలు ఫలాలతో విశేషంగా అలంకరించనున్నారు. అమ్మవారిని శాకాలతో అర్చించడం వలన అతివృష్టి, అనావృష్టి నివారించబడి, సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండుతాయని పురాణాలు చెబుతున్నాయి.

ఆలస్యంగా నడిచిన రైళ్లు

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు– కాచిగూడ (హైదరాబాద్) మధ్య రాకపోకలు సాగిస్తున్న నాలుగు రైళ్లు ఆదివారం ఆలస్యంగా నడిచాయి. తెలంగాణలోని గద్వాల – మనోపాడు మధ్య జరుగుతున్న రైల్వే ట్రాక్ పనుల కారణంగా సుమారు మూడు గంటలు ఆలస్యంగా నడిచాయి. తుంగభద్ర ఎక్స్‌ప్రెస్‌తో పాటు గుంటూరు రైళ్లకు అంతరాయం ఏర్పడింది. ప్రతి ఆది, మంగళ, గురువారాల్లో చేపడుతున్న ట్రాక్ పనుల కారణంగా అంతరాయం ఏర్పడున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

పోలీస్ శాఖలో పరస్పర బదిలీలు

- 18 మందికి స్థాన చలనం

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పోలీస్ శాఖకు సంబంధించి పరస్పర బదిలీలు చేస్తూ ఎస్పీ జీ కృష్ణకాంత్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్న వారిని నంద్యాల జిల్లాకు, అక్కడ విధులు నిర్వహిస్తున్న వారిని కర్నూలు జిల్లాకు బదిలీలు చేశారు. రెండు జిల్లాలకు కలిపి బదిలీ అయిన వారిలో ఆరుగురు హెడ్‌కానిస్టేబుళ్లు , ఇద్దరు ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లు, తొమ్మిది మంది కానిస్టేబుళ్లు, ఒక మహిళా కానిస్టేబుల్ ఉన్నారు.

ఆంజనేయుడు ఒక్కడే మిగిలాడు

- కాల గర్భంలో రామాపురం
- 2004లో రెవెన్యూ రికార్డుల్లోంచి తొలగింపు
- ఆనవాళ్లుగా హనుమంతుడి ఆలయం, సత్రం
- కబ్జాకు గురవుతున్న గ్రామ కంఠం స్థలాలు



ఆలయంలో ఆంజనేయస్వామి విగ్రహం

చాగలమర్రి: అనగనగా ఓ గ్రామం. పచ్చని నల్లమల అందాల చెంతన పల్లెవించిన జీవన సమూహం క్రమంగా అక్కడి నుంచి వెళ్లిపోయింది. అప్పటి ఇళ్లు, గుడిసెలు నేల మట్టమయ్యాయి. ఊరి పేరును రెవెన్యూ రికార్డుల్లోనుంచి తొలగించారు. ఇందుకు సాక్ష్యంగా ఆంజనేయస్వామి దేవాలయం ఒక్కటే మిగిలింది. మండలంలో కాలగర్భంలో కలిసిన రామాపురం గ్రామానికి ఎంతో విశిష్టత ఉంది. ముత్యాలపాడు పంచాయతీ పరిధిలో ఉన్న ఈ గ్రామానికి ఓజీ తండా మీదుగా నాలుగు కి.మీ ప్రయాణించి చేరుకునేవారు. పూర్వం పలు గ్రామాల ప్రజలు అటవీ సమీప పొలాల్లో వ్యవసాయం చేసుకుంటూ వలస వచ్చి నివాసాలు ఏర్పాటు చేసుకోవడంతో రామాపురం గ్రామం ఏర్పడినట్లు పెద్దలు చెబుతున్నారు. పూర్వం ఆళ్లగడ్డ మండలం బాచేపల్లె గ్రామంలో ఓ సారి కలరా సోకి ఎక్కువగా ప్రాణ నష్టం సంభవించగా గ్రామస్తులు ప్రాణ భయంతో రామాపురం గ్రామానికి వలస వచ్చినట్లు తెలుస్తోంది. ఈ గ్రామంలో చెంచు, ముస్లిం, రజక, మంగలి, బలిజ సామాజిక వర్గాలకు చెందిన కుటుంబాలు నివాసం వుండే వారని, కాలక్రమేణా వారందరూ సమీపంలోని అహోబిలం, బాచేపల్లె తండా తదితర ప్రాంతాలకు వలస వెళ్లినట్లు తెలుస్తోంది. దాదాపు 40 ఏళ్ల క్రితం వరకు పది కుటుంబాల మేర ఉండగా వారంతా రేషన్ కార్డులు కలిగి ముత్యాలపాడు గ్రామంలో నిత్యావసర సరుకులు తీసుకెళ్లేవారు. 2004 జనాభా గణాంకాల సమయంలో రెవెన్యూ రికార్డుల నుంచి రామాపురం గ్రామం పేరును ప్రభుత్వ అధికారులు తొలగించారు. ముత్యాలపాడు గ్రామం మీదుగా నల్లమల ప్రాంతంలో వెలసిన అహోబిల శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు భక్తులు ఈ రహదారి మీదుగా వెళ్లేవారు. అంతే కాకుండా అటవీ ప్రాంతానికి కలప సేకరించటానికి వెళ్లే వారి సౌకర్యార్థం ఇక్కడ దాహం తీర్చడానికి ఓ మంచి నీళ్ల బావి, కొద్ది సేపు విశ్రాంతి తీసుకోవడానికి ఓ సత్రాన్ని కూడా నిర్మించారు. ఇవి ఇప్పటికీ చెక్కుచెదరలేదు. ప్రస్తుతం గ్రామం కనుమరుగు కాగా ఆనవాళ్ల ఆంజనేయ స్వామి ఆలయం, సత్రం, మంచి నీటి బావి ఆనవాళ్లుగా మిగిలాయి. కాగా ఆంజనేస్వామి ఆలయం ఆధారంగా 80 ఏళ్ల ఒంటరి సుబ్బమ్మ జీవనం సాగిస్తోంది. దేవుడి దీపారాధన చేసుకుంటూ ఆలయ మాన్యం భూమికి వచ్చే కౌలు ధాన్యంతో కాలం వెళ్లదీస్తోంది. కాగా రామాపురం గ్రామ కంఠం స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. ఆలయ మాన్యం భూములు కొంత మంది ఆక్రమించడంతో ధూపదీప నైవేద్యానికి కష్టంగా మారింది.



నేటికీ చెక్కుచెదరని పురాతన సత్రం



నాటి చరిత్రకు ఆధారంగా నిలిచిన పురాతన బావి

ఆలయాన్ని అభివృద్ధి చేయాలి



రామాపురం గ్రామం కనుమరుగు అయినా ఆ ఊరి పేరు చరిత్రలో నిలిచేలా ఆంజనేయ స్వామి ఇక్కడే కొలువై ఉన్నాడు. డి.వనిపెంట, ముత్యాలపాడు, కొత్తపల్లె, బాచేపల్లె గ్రామాలకు చెందిన ప్రజలు వివాహాది శుభకార్యాలు ఇక్కడే నిర్వహిస్తుంటారు. దేవదాయ శాఖ ఆలయాన్ని అభివృద్ధి చేసి కల్యాణమండపం నిర్మిస్తే చాలా బాగుంటుంది.

– ఆవుల పామిలేటి, బాచేపల్లె గ్రామం

మంచినీటి బోరును ఆక్రమించారు



భక్తుల సౌకర్యార్థం కొంతమంది దాతలు బోరు వేయించి, మినీ ట్యాంకు అమర్చారు. అయితే ఈ బోరుకు బాచేపల్లె తండాకు చెందిన ఓ ప్రజా ప్రతినిధి మోటారు అమర్చి తన పొలానికి నీరు పారించుకుంటున్నాడు. ఆంజనేయ స్వామి ఆలయాన్ని పరిరక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వలస ఆంజనేయులు, శెట్టివీడు గ్రామం

క్లుప్తంగా

మహిళ అదృశ్యం


చాకలి శైలజ(ఫైల్)

కర్నూలు(అర్బన్): నగరంలోని గణేష్‌నగర్‌కు చెందిన సీ రాముడు కుమార్తె చాకలి శైలజ (19) అదృశ్యం అయినట్లు మూడో పట్టణ పోలీసులు తెలిపారు. గత నెల 30వ తేదీన సాయంత్రం 6 గంటల సమయంలో ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయిందన్నారు. ఈ మేరకు శైలజ తల్లి చాకలి అరుణ ఈ నెల 2వ తేదీన ఫిర్యాదు చేసిందన్నారు. అదృశ్యం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రీసర్వేను వేగవంతం చేయాలి

కర్నూలు(సెంట్రల్): రీసర్వేను వేగవంతం చేయాలని కొనేరు రంగారావు కమిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగప్రసన్న లక్ష్మీ అధికారులను ఆదేశించారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో రీసర్వేపై కొత్తగా వచ్చిన డీటీలు, వీఆర్వోలు, సర్వేయర్లకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..రీసర్వేను ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. ఈ నేపథ్యంలో రీసర్వేపై అధికారుల్లో ఉన్న పలు అనుమానాలను నివృత్తి చేయడానికే శిక్షణ తరగతులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

డీసీసీబీ ప్యాక్స్ డెవలప్‌మెంట్ మేనేజర్ బదిలీ

- నహిదా సుల్తానా నియామకం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్రబ్యాంకులో ప్యాక్స్ డెవలప్‌మెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న బరద్వాజశర్మ బదిలీ అయ్యారు. ఆప్కాబ్‌లో ఏజీఎం స్థాయి అధికారి అయిన ఈయన మూడేళ్లుగా డిప్యూటేషన్‌పై ప్యాక్స్ డెవలప్‌మెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పీఏసీఎస్‌లను బహుళ సేవ సంస్థలుగా అభివృద్ధి చేయడంలో ఈయన కీలకంగా వ్యవహించారు. ఈయనను గుంటూరు జిల్లా ఏటీ అగ్రహారం ఆప్కాబ్ బ్రాంచీ మేనేజర్‌గా నియమిస్తూ ఆప్కా బ్ ఎండీ శ్రీనాథరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన స్థానంలో ఆప్కాబ్‌లో ఏజీఎంగా పని చేస్తున్న నహిదా సుల్తానాను నియమించారు.

నకిలీ పత్రాలతో స్థలాన్ని కబ్జా చేసిన ముఠా అరెస్ట్

బొమ్మలసత్రం: నకిలీ పత్రాలతో రైతునగరం సమీపంలో స్థలాన్ని రిజిస్టర్ చేసుకుని కబ్జాకు పాల్పడిన ఐదుగురు నిందితులను పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ రఘువీర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక సుబ్రమణ్యం కాంప్లెక్స్‌లో గోపాల్ రియల్ ఎస్టేట్ పేరుతో వ్యాపారం చేస్తున్న వడ్డె గోపాల్ రైతునగరం సమీపంలో 5 సెంట్ల స్థలంపై కన్నేశాడు. దీంతో ఆషా అనే మహిళ పేరుతో నకిలీ ధ్రువపత్రాలు తయారు చేయించి తన పేరుపై రిజిస్టర్ చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న అసలు యజమాని సాంబిరెడ్డి ఫిర్యాదు మేరకు త్రీటౌన్ సీఐ నరసింహులు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

వేలాడే తీగలు కాటేయకుండా..

- ప్రమాదకర విద్యుత్ తీగల ఎత్తు పెంచేందుకు చర్యలు
- నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- రూ.35 కోట్లతో లూజ్ లైన్ నివారణ పనులు
- రోడ్డు క్రాసింగ్ తీగల కోసం రూ.15 కోట్ల ఖర్చు
- 6 వేల స్తంభాలను వినియోగించిన అధికారులు

కర్నూలు(రాజ్‌విహార్): కిందికి వేలాడుతూ మనుషులు, జంతువుల ప్రాణాలు తీస్తున్న విద్యుత్ తీగలను అధికారులు యుద్ధ ప్రాతిపదికన సరిచేస్తున్నారు. ఇందు కావాల్సిన నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కరెంట్ ప్రమాదాలు నివారించేందుకు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆపరేషన్స్ సర్కిల్ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వేలాడే తీగల ఎత్తు పెంచుతున్నారు. ప్రమాదాలు జరగకుండా ఆరు నెలలుగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. వినియోగదారుల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును నమోదు చేసుకొని సమస్య పరిష్కారానికి ఎన్ని నిధులు అవసరమవుతాయో ఏఈలతో అంచనా వేయించారు. అంచనాలకు అనుగుణంగా రూ.35 కోట్ల ప్రత్యేక నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో పనులు పురోగతి బాటలో ఉన్నాయి.


గూడూరు పట్టణంలో ప్రమాదకర స్తంభాలను తొలగించి కొత్త లైను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ప్రమాదాలు ఇలా..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో విద్యుత్ ప్రమాదాలు నియంత్రణలోకి రావడం లేదు. వినియోగదారులు సొంతంగా పనులు చేసుకోవడం, అవగాహన లేకపోవడం, అప్రమత్తంగా ఉండకపోవడం తదితర కారణాలతో తరచూ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వివిధ కారణాలతో కరెంటు కాటుకు బలవుతున్న అమాయకుల సంఖ్య పెరుగుతూనే ఉంది. ముఖ్యంగా పంట పొలాల్లో తీగలు కిందికి ఉండడం, అనధికారికంగా కర్రలు పాతి తీగలు వేసుకున్న సందర్భాల్లో గాలి, వర్షాల వల్ల మరింత కిందికి చేరడం, సొంతంగా పనులు చేసుకోవడం వల్ల దుర్ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. 2019-20లో 98, 2020-21లో 88, గతేడాది 102 ప్రమాదాలు జరిగినట్లు తెలుస్తోంది.

ఆరేళ్లలో 400 మంది బలి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత ఆరేళ్లలో 627 విద్యుత్ ప్రమాదాలు జరగ్గా 400 మంది వరకు మృత్యువాతపడ్డారు. 83 మంది గాయాలపాలయ్యారు. 153 ప్రమాదాల్లో 180 మూగజీవాలు బలయ్యాయి. ప్రతి ఏటా అధికారికంగా 100కు పైగా ప్రమాదాలు నమోదవుతున్నాయి. సగటున 50 నుంచి 80 మంది వరకు అమాయక ప్రజలు మృతి చెందుతున్నారు.

ప్రమాదాల నివారణకు అత్యధిక ప్రాధాన్యత

ప్రమాదాల నివారణకు విద్యుత్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. తక్కువ ఎత్తులో ఉన్న, వేలాడే తీగలను సరి చేసేందుకు అధ్యధిక ప్రాధాన్యత ఇస్తూ రైతులు, వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వాటి పనులు చేసేందుకు ఏఈలు అంచనా (ఎస్టిమేషన్) వేసి, కావాల్సిన నిధులు కోరుతూ నివేదికలు పంపారు. దీనికి కావాల్సిన నిధులు మంజూరు చేయడంతో వర్క్ ఆర్డర్, సామగ్రి (మెటీరియల్) కొనుగోలు చేసి పనులు చేస్తున్నారు.

రూ.35 కోట్లతో పనులు

ప్రజల భద్రత, ప్రమాదాల నివారణను దృష్టిలో పెట్టుకొని తయారు చేసి పంపిన ప్రతిపాదనలకు కావాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ముఖ్యంగా ప్రమాదకర విద్యుత్ వైర్లు, స్తంభాలను తొలగించడం, తీగల ఎత్తు పెంచడం, మధ్యలో ఇంటర్ పోల్ ఏర్పాటు చేసేందుకు దృష్టి సారించారు. దీని కోసం ప్రభుత్వం రూ.35కోట్లు మంజూరు చేయడంతో పనులు చేపట్టారు. ఇందులో రూ.15కోట్లు ఖర్చు చేసి పనులు పూర్తి చేశారు. ఇంకా రూ.20కోట్లతో పనులు చేయాల్సి ఉంది. ఇప్పటికే 6 వేల స్తంభాలు ఏర్పాటు చేయగా మరో 10 వేల స్తంభాలు పెట్టాల్సి ఉంది. ప్రమాదకరంగా ఉన్న తీగలు, స్తంభాలను గుర్తించి లైన్‌మ్యాన్, ఏఈలకు చెబితే.. నిధులు మంజూరు చేసి పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు



ఎక్కడైనా ప్రమాదకర తీగలు ఉంటే సంబంధిత ఏఈ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. వేలాడుతూ, నేలకు తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను సరి చేస్తున్నాం. రైతులు, వినియోగదారులు చేసుకున్న విన్నపాల మేరకు పనుల చేస్తున్నాం. ప్రభుత్వం రూ.35కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే రూ.15కోట్లతో పనులు నాణ్యతతో పూర్తి చేశాం. – ఎం. ఉమాపతి, విద్యుత్ ఆపరేషన్స్ ఎస్‌ఈ, కర్నూలు.

వేళాంగిణి మాత దర్శనానికి 7న ప్రత్యేక బస్సు

కర్నూలు(రాజ్‌విహార్): తమిళనాడులోని వేళాంగిణి మాతా దర్శనం కోసం ప్రత్యేక బస్సు నడపనున్నట్లు కర్నూలు-2డిపో మేనేజరు సర్దార్ హుసేన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7తేదీన శుక్రవారం రాత్రి 8గంటలకు కర్నూలు కొత్త బస్టాండ్ నుంచి ఈ బస్సు బయలుదేరుతుందని, ఆదివారం ఉదయం జరిగే తెలుగు ప్రార్థనకు హాజరయ్యే విధంగా బస్సు నడపనున్నట్లు పేర్కొన్నారు. సూపర్ లగ్జరీ సర్వీసు (నంబర్-93622)లో పెద్దలకు చార్జీ రూ.3వేలు, పిల్లలకు రూ.2వేలు ఉంటుందని, ఇందులో ముందస్తుగా టికెట్లు పొందేందుకు అడ్వాన్స్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ఆర్టీసీ బస్‌స్టేషన్లలోని రిజర్వేషన్ కౌంటర్లతో పాటు అధీకృత డీలర్లు, నెట్ సెంటర్లతో టికెట్లు పొందవచ్చని పేర్కొన్నారు.

8, 9 తేదీల్లో డీసీసీబీ సమావేశాలు

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్రబ్యాంకు బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ సమావేశం, మహాజనసభ ఈ నెల 8, 9 తేదీల్లో జరుగనున్నాయి. చైర్‌పర్సన్ మహాలక్ష్మి అధ్యక్షతన ఈ సమావేశాలు నిర్వహించనున్నారు. బోర్డు సమావేశం 8న జిల్లా సహకార కేంద్రబ్యాంకు సమావేశ మందిరంలో జరుగుతుంది. 9న మహాజనసభ వెంకటరమణ కాలనీలోని హరిత గెస్ట్ హౌస్‌లో నిర్వహించనున్నారు. మహాజనసభకు పాలకవర్గం సభ్యులతో పాటు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని పీఏసీఎస్‌ల చైర్మన్‌లు, సీఈఓలు కూడా పాల్గొంటారు. ఈ సమావేశాల్లో రైతుల సంక్షేమం లక్ష్యంగా పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

శ్రీమఠంలో ఘనంగా బంగారు పల్లకీ సేవ

- భారీగా తరలివచ్చిన భక్తులు

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో బృందావన ప్రతిమను బంగారు పల్లకీలో ఊరేగించారు. ఆదివారం కావడంతో శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచి పీఠాధిపతి శ్రీ సుభుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో మూలబృందావనానికి నిర్మల్య విసర్జన, ఫల, పుష్ప,పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి తీసుకుని వచ్చిన ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. రాత్రి ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు, నవరత్న రథాలపై ఉంచి శ్రీ మఠం మాడ విధుల్లో ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా తుంగభద్ర నదిలో పుణ్య స్నానమాచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.


బృందావన ప్రతిమను బంగారు పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

ముగిసిన శ్రీశైల వైభవం జాతీయ సదస్సు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్ర వైభవంపై మూడు రోజులుగా జరుగుతున్న జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ జూన్ 30న శ్రీశైలంలో ఈ సదస్సు ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ సదస్సులో పలువురు విశ్వవిద్యాలయాల, కళాశాలల అధ్యాపకులు, పండితులు, పరిశోధనా విద్యార్థులు వివిధ అంశాలపై ప్రసంగించారు. శ్రీశైల క్షేత్రానికి సంబంధించి 18 మంది ఆయా అంశాలపై పరిశోధనా అంశాలను సమర్పించారు. ఆదివారం జరిగిన కార్యక్రమానికి నెల్లూరుకు చెందిన ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య ఎం. సంపత్‌కుమార్ అధ్యక్షత వహించారు. శ్రీశైల ప్రభ సంపాదకులు డాక్టర్ పి. అనీల్‌కుమార్ మాట్లాడుతూ జానపద సాహిత్యంలో శ్రీశైల ప్రస్థావన, హైదరాబాద్‌కు చెందిన నారాయణ ఐఏఎస్ అకాడమీ తెలుగు అధ్యాపకులు డాక్టర్ అనీల్‌కుమార్ విశ్వనాథ రచనలలో శ్రీశైలం ప్రస్థావన, మహబూబ్ నగర్‌కు చెందిన ఉపాధ్యాయుడు భీమ్‌పల్లి శ్రీకాంత్ శ్రీశైలం సాహిత్యం- సాంస్కృతిక శిల్పంపై, ఉమా వెంకట జవహర్‌లాల్ పంచమఠాన పునరుద్ధరణ గురించి వివరించారు. సదస్సులో పత్రసమర్పణ చేసిన వారికి, ఆయా అంశాలపై ప్రసంగించిన వారికి స్వామివారి శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.


సదస్సులో వివిధ అంశాలపై చర్చించిన వారిని సన్మానించిన దృశ్యం

కర్నూలులో 'సామజవరగమన' సందడి

కర్నూలు కల్చరల్: సామజవరగమన సినిమా హీరో హీరోయిన్లు కర్నూలులో సందడి చేశారు. ఈనెల 29వ తేదీన విడుదలైన ఈ చిత్రానికి సక్సెస్ టాక్ రావడంతో హీరో హీరోయిన్లు శ్రీ విష్ణు, రెబ్బా మౌనిక, దర్శకుడు రామ్ అబ్బరాజులు ఆదివారం కర్నూలుకు వచ్చారు. సినిమా ప్రదర్శిస్తున్న ఎస్‌వీసీ సినీ కాంప్లెక్స్‌లోని థియేటర్‌కు వెళ్లి ప్రేక్షకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సినిమాను కుటుంబ సమేతంగా చూడాలని వారు ప్రేక్షకులను కోరారు. సినిమాను ఆదర్శిస్తున్నందుకు ప్రేక్షకులందరికి ధన్యవాదాలు తెలిపారు.


మాట్లాడుతున్న హీరో శ్రీవిష్ణు, చిత్రంలో హీరోయిన్ రెబ్బా మౌనిక తదితరులు

కోటేకల్ కొండల్లో చిరుత

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కోటేకల్ గ్రామ సమీపంలోని కొండలో చిరుత సంచరిస్తోంది. శనివారం అర్ధరాత్రి కొండ దిగి మేకల మంద దగ్గరకు రాగా.. కాపలాగా ఉన్న 20 మంది యువకులు టార్చ్ లైట్లు వేసి కేకలు వేయటంతో పారిపోయింది. శుక్రవారం ఇదే చిరుత గడ్డం హనుమంతు అనే రైతుకు చెందిన మేకను చంపి తిన్న విషయం తెలిసిందే. చిరుత సంచారంతో రైతులు, గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు.

హత్య చేసి.. మృతదేహాన్ని తగులబెట్టి !

కర్నూలు: తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లా కొత్తకోట మండలం రామక్రిష్టాపురం గ్రామానికి చెందిన కావలి భారతయ్య (55)ను హత్య చేసి కర్నూలు జిల్లాలోని కల్లూరు మండలం ఉల్లిందకొండ సమీపంలోని కొల్లంపల్లి తండా వద్ద తగులబెట్టిన కేసు మిస్టరీని కొత్తకోట పోలీసులు చేధించారు. హతుని భార్య ఫిర్యాదు మేరకు మొదట మిస్సింగ్ కేసు కింద నమోదు చేసిన పోలీసులు ఆచూకీ కనుగొనే క్రమంలో అనుమానితుడైన అదే గ్రామానికి చెందిన గడ్డం రవీంద్రగౌడును అదుపులోకి తమదైలిలో విచారించగా అసలు విషయం బయట పడింది. గడ్డం రవీంద్రగౌడ్, కావలి భారతయ్య మధ్య వ్యక్తిగత తగాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ... గత నెల 26వ తేదిన తెలంగాణ రాష్ట్రం అప్పరాల గ్రామం వద్ద గడ్డం రవీంద్రగౌడ్ మిత్రడు మహమ్మద్ షఫీ సహాయంతో కిడ్నాప్ చేసి మారుతీ జెన్ కారులో అప్పరాల గ్రామం నుంచి కొత్తకోటకు వెళ్లే దారిలో టవల్‌తో గొంతు బిగించి హత్య చేశారు. మృతదేహాన్ని కనుమరుగు చేయాలనే ఉద్దేశంతో కొత్తకోట నుంచి బెంగుళూరు వైపు ప్రయాణిస్తు కల్లూరు మండలం ఉల్లిందకొండ సమీపంలోని కొల్లంపల్లి తండాకు 2 కిలోమీటర్ల దూరంలో తిప్పరోని గుట్ట రాళ్ల మధ్యలో శవాన్ని పడేసి వెంట తెచ్చుకున్న పెట్రోల్ పోసి తగులబెట్టి పరారయ్యారు. గడ్డం రవీంద్రగౌడ్ ఇచ్చిన సమాచారం మేరకు ఆదివారం కొత్తకోట పోలీసులు అతన్ని వెంటబెట్టుకొని సంఘటనా స్థలానికి వచ్చా రు. మృతదేహం పూర్తిగా కాలిపోయి గుర్తుపట్టలేకుండా ఉండడంతో కర్నూలు మెడికల్ కళాశాల ఫోరెన్సిక్ సైన్స్ అండ్ మెడిసిన్ ప్రొఫెసర్ డా.బ్రాహ్మజీ, జీజీహెచ్ సీఎంఓ డాక్టర్ క్లింటన్ చక్రవర్తి, పీజీ విద్యార్థులు డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, అభినయ్‌తో కలిసి శవ పరీక్ష నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మిస్సింగ్ కేసును హత్య కేసుగా మార్చు చేసి అనుమానితుడు గడ్డం రవీంద్రగౌడ్, మహమ్మద్ షఫీపై కేసు నమోదు చేసినట్లు కొత్తకోట సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కేసు దర్యాప్తు విషయంలో ఉల్లిందకొండ పోలీసుల సహకారం తీసుకున్నట్లు సీఐ చెప్పారు.


కాలిపోయిన భారతయ్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మరికొందరు టీచర్లకు పదోన్నతులు!

కర్నూలు సిటీ: గత నెలలో సుమారుగా 1400 మంది ఎస్‌జీటీ టీచర్లకు విద్యాశాఖ పదోన్నతి అవకాశం కల్పించింది. తాజాగా మరికొంత మందికి పదోన్నతులు ఇవ్వనున్నారు. జిల్లాలో ప్రభుత్వ, జెడ్పీ యాజమన్యాల పరిధిలోని పాఠశాలల్లో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు గ్రేడ్-2 హెచ్‌ఎంలుగా, సెకెండ్ గ్రేడ్ టీచర్లుగా పని చేస్తున్న వారికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించనున్నారు. గత నెలలో మండలానికి ఇద్దరు విద్యాధికారులను నియమించడంతో ప్రధానోపాధ్యాయ పోస్టులు ఖాళీ అయ్యాయి. ఆ పోస్టులలో స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు ఇవ్వనున్నారు. దీని వల్ల ఖాళీ అయ్యే స్కూల్ అసిస్టెంట్ల స్థానాలతో పాటు, ఖాళీగా ఉండే పోస్టులన్నింటిలో ఎస్‌జీటీలకు పదోన్నతులు ఇచ్చి భర్తీ చేయనున్నారు. ఇందుకు సంబంధించిన సీనియారిటీ జాబితాలపై అభ్యంతరాలు స్వీకరించారు. తుది సీనియారిటీ జాబితాలను నేడో, రేపో వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టనున్నారు. 55 గ్రేడ్-2 హెచ్‌ఎం పోస్టులు, స్కూల్ అసిస్టెంట్ పోస్టులు గణితం(తెలుగు మీడియం)50 పోస్టులు, గణితం(ఉర్దూ)10 పోస్టులు, బయోలాజికల్ సైన్స్(తెలుగు మీడియం)36 పోస్టులు, ఫిజికల్ సైన్స్ 28 పోస్టులు, సోషల్ స్టడీస్(తెలుగు మీడియం)67, సోషల్ స్టడీస్(ఉర్దూ మీడియం)08 పోస్టులు, ఇంగ్లిషు 61 పోస్టులకు పదోన్నతులు కల్పించనున్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ


బ్యాగును బాధితురాలకు అందజేస్తున్న ఆటో డ్రైవర్

బనగానపల్లెరూరల్: రహదారిపై దొరికిన బ్యాగ్‌ను ఓ ఆటో డ్రైవర్ పోలీసులకు అప్పగించి నిజాయితీని చాటుకున్నాడు. ఎస్‌ఐ రామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. చెరువుపల్లె గ్రామానికి చెందిన జమీదాబి ఆదివారం పని నిమిత్తం బనగానపల్లెకు వచ్చింది. తన వెంట తెచ్చుకున్న బ్యాగును పొరబాటున కింద పడేసుకుంది. అందులో సుమారు రూ.15 వేల విలువ చేసే సెల్‌ఫోన్, కొంత నగదుతో పాటు ఇతర వస్తువులు ఉన్నాయి. ఈ బ్యాగు ఆటో డ్రైవర్ సుధాకర్‌కు లభించింది. అతను వెంటనే ఎస్‌ఐ రామిరెడ్డికి అందజేసి విషయం తెలిపాడు. సెల్‌ఫోన్ నంబరు ద్వారా బాధితురాలు జమిదాబీని పిలిపించి బ్యాగ్‌ను అందజేశారు. నిజాయితీని చాటిన ఆటో డ్రైవర్ సుధాకర్‌ను ఎస్‌ఐ, పోలీసులు అభినందించారు.

పాము కాటుతో మహిళ మృతి


మృతి చెందిన లక్ష్మీదేవి

కొలిమిగుండ్ల: మీర్జాపురంలో పాము కాటుకు ఆదివారం ఓ మహిళ మృతి చెందింది. గ్రామానికి చెందిన లక్ష్మీదేవి కొన్నేళ్ల నుంచి కుటుంబంలో మనస్పర్థలు ఏర్పడటంతో భర్త నుంచి విడిగా ఉంటుంది. గ్రామంలోనే కుమారుడితో కలిసి నివాసం ఉండేది. మధ్యాహ్నం సమయంలో ఇంట్లో ఉండగా పాము కాటుకు గురైంది. స్థానికులు ఆమెను అనంతపురం జిల్లా తాడిపత్రి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందింది. అంత్యక్రియల నిమిత్తం లక్ష్మీదేవి మృతదేహాన్ని కుటుంబ సభ్యులు పుట్టినిల్లు అయిన బందార్లపల్లెకు తరలించారు.

పకడ్బందీగా బిల్లింగ్ ప్రక్రియ

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ బిల్లింగ్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి ఆదేశించారు. ఆదివారం ఆయన స్థానిక విద్యుత్ భవన్ నుంచి కింది స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి మీటర్ వద్దకు రీడర్ తప్పనిసరిగా వెళ్లి స్కాన్ చేయాలని, ఇల్లు, షాపుల మీటర్‌ను చూసిన తరువాతే బిల్లు తీయాలన్నారు. వాడిన యూనిట్ల కంటే రీడింగ్ హెచ్చు తగ్గులు రావడం వంటి సమస్యలు తలెత్తితే రీడర్లు వెంటనే ఏఈల దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

రైతు బజార్లలో సబ్సిడీ టమాటా పంపిణీ

- కర్నూలులో 5,500 మంది వినియోగదారులకు అందజేత

కర్నూలు(అగ్రికల్చర్): టమాటా ధరలు పెరిగిపోయిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక చొరువ తీసుకొని సబ్సిడీపై కిలో రూ.50 ప్రకారం పంపిణీ చేస్తోంది. దీంతో వినియోగదారులకు ఊరట లభిస్తోంది. ఆదివారం కర్నూలులోని సీ.క్యాంపు, అమీన్ అబ్బాస్ నగర్, కొత్తపేట రైతుబజార్లలో 5,500 మందికి కిలో చొప్పున అందజేశారు. టమాటా పంటకు జిల్లా పెట్టింది పేరు. ప్రస్తుతం సాగు లేకపోవడంతో కొరత ఏర్పడింది. రైతుబజారు బయట కిలో రూ.120 ప్రకారం బోర్డు పెట్టి అమ్మకాలు సాగిస్తున్నారు. వినియోగదారులకు ఊరట కల్పించేందుకు ప్రభుత్వం రైతుబజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి సబ్సిడీపై కిలో రూ.50 ప్రకారం పంపిణీ చేస్తోంది. మార్కెటింగ్ శాఖ అధికారులు మదనపల్లిలో 6 టన్నుల టమాటా కొనుగోలు చేశారు. కొనుగోలు, ప్యాకింగ్, లోడింగ్, ట్రాన్స్‌పోర్టులకు రూ.6,31,575 ఖర్చు వచ్చింది. కర్నూలుకు చేరే సరికి కిలో ధర రూ.112.28 పడింది. వినియోగదారులకు ఊరట కల్పించడమే లక్ష్యంగా కిలో రూ.50కే పంపిణీ చేశారు. కర్నూలుకు వచ్చిన టమాటాలో సి.క్యాంపు రైతుబజారులో 3.3 టన్నులు, అమీన్ అబ్బాస్ నగర్, కొత్తపేట రైతుబజార్లకు 2.7 టన్నులు పంపారు. డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ఒక్కో వినియోగదారునికి కిలో ప్రకారం పంపిణీ చేశారు. మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణ మూర్తి సీ.క్యాంపు రైతుబజారులో ఉండి పర్యవేక్షించారు. టమాటా ధరలు అదుపులోకి వచ్చే వరకు వారంలో రెండు రోజులు సబ్సిడీపై పంపిణీ చేయాలనే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.


కర్నూలు సి.క్యాంపు రైతుబజారులో టమాటా కోసం గుమికూడిన వినియోగదారులు

అధిక దిగుబడికి 'పట్టుబడి'

- ఈ ఏడాది పెద్ద ఎత్తున పట్టుబడి కార్యక్రమాలు
- పట్టుగూళ్ల ఉత్పత్తి పెంచడమే లక్ష్యం
- 100 గుడ్లకు 100 కిలోల పట్టుగూళ్ల ఉత్పత్తి సాధించేలా ప్రణాళికలు
- ఈ ఏడాది 300 ఎకరాల్లో మల్బరీ సాగు


పెంపకంలో ఉన్న పట్టుపురుగులు

కర్నూలు(అగ్రికల్చర్): భారీగా పట్టుగూళ్ల ఉత్పత్తే లక్ష్యంగా పట్టుపరిశ్రమ శాఖ చర్యలు చేపట్టింది. ఇందుకోసం పొలంబడి, తోటబడి, మత్స్యసాగుబడి తరహాలోనే డాక్టర్ వైఎస్ఆర్ పట్టుబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ ఏడాది మల్బరీ మొక్కలు నాటడం మొదలు పట్టుగూళ్ల ఉత్పత్తి వరకు వారం, వారం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన పెంచనున్నారు.

జిల్లాలోని వెల్దుర్తి, తుగ్గలి, పత్తికొండ, ఆదోని, కర్నూలు తదితర ప్రాంతాల్లో పట్టుసాగు ఎక్కువగా ఉంది. పట్టు పరిశ్రమకు సంబంధించి మల్బరీ సాగు, పట్టుపురుగుల పెంపకం తదితర వాటిపై రైతులకు అవగాహన పెంచడం ద్వారా ఉత్పాదకతను పెంచాలనేది ప్రధాన ఉద్దేశం. జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు 2,500 ఎకరాల్లో పట్టు పరిశ్రమ కింద మల్బరీ సాగు చేస్తున్నారు. ఈ ఏడాది అదనంగా 300 ఎకరాల్లో మల్బరీ సాగు చేసేందుకు చర్యలు చేపట్టారు. పట్టుసాగుబడి కార్యక్రమాలను గ్రామ సెరికల్చర్ అసిస్టెంటు, సహాయ పట్టు పరిశ్రమ అధికారులు చేపడుతారు. జిల్లా పట్టుపరిశ్రమ శాఖ అధికారి విజయకుమార్, సెరికల్చర్ అధికారులు వాటిని పర్యవేక్షిస్తారు. పట్టుబడి కార్యక్రమం వారానికోసారి ప్రకారం 42 వారాల పాటు జరుగుతుంది. వ్యవసాయ పంటలు, ఉద్యాన పంటలతో పోలిస్తే పట్టుపరిశ్రమ సాగు కొంత కష్టంతో కూడుకున్నది. అయితే నికరాదాయం ఎక్కువగా ఉంటుంది. ఏడాదికి ఐదారు పంటలు తీసుకోవచ్చు.

208 టన్నుల పట్టు గూళ్ల ఉత్పత్తే లక్ష్యం

పట్టుబడి కార్యక్రమం ద్వారా పట్టుపరిశ్రమపై రైతులకు అవగాహన కల్పించి రికార్డు స్థాయిలో ఉత్పాదకతను సాధించాలనేది లక్ష్యం. జిల్లాలో ప్రధానంగా బైవోల్టెన్ పట్టు గూళ్లు ఉత్పత్తి చేస్తున్నారు. వీటి నుంచి నాణ్యమైన సిల్క్ వస్తుంది. 2023-24లో 208 పట్టుగూళ్లు ఉత్పత్తి చేసే విధంగా ప్రభుత్వం జిల్లాకు లక్ష్యాన్ని ఇచ్చింది. ప్రస్తుతం జిల్లా మొత్తం మీద సగటున 100 గుడ్లకు 80 కిలోల పట్టుగూళ్లు ఉత్పత్తి సాధిస్తున్నారు. పట్టుబడి కార్యక్రమం ద్వారా ఉత్పత్తిని 100 కిలోలకు పెంచాలని జిల్లా యంత్రాంగం ఉంది. ఒక్కో గుడ్డులో దాదాపు 350 వరకు పట్టుపురుగులు వస్తాయి. ఇలా వంద గుడ్లకు 35 వేల పట్టుపురుగులు ఉత్పత్తవుతాయి. ఈ పురుగులు మల్బరీ ఆకును తిని పట్టుగూళ్లు ఉత్పత్తి చేస్తాయి.

పట్టుబడి కార్యక్రమం ద్వారా అవగాహన

డాక్టర్ వైఎస్ఆర్ పట్టుబడి రైతు శిక్షణ కార్యక్రమాలను ఈ ఏడాది పెద్ద ఎత్తున నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. పట్టుసాగులో మెలకువలు, పట్టుపురుగుల పెంపకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎకరాకు మల్బరీ మొక్కలు ఎన్ని నాటుకోవాలి, పట్టుపురుగుల బ్రస్సింగ్, సాంకేతిక సహకారం ఇలా ప్రతి అంశంపై అవగాహన కల్పించనున్నారు.